

ఉష్ణోగ్రత: గరిష్ఠం 37.5 కనిష్ఠం 16.4



రంజాన్ వేళలు
ఇఫ్తార్-గురువారం
సాయంత్రం - 6.31
సహర్-శుక్రవారం
ఉదయం - 5.03

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్ష

వికారాబాద్, మార్చి12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్, బాటనీ, పొలిటికల్ సైన్స్, ఒకేషనల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 7,425 మంది విద్యార్థులకు 7,263 మంది హాజరు కాగా, 162 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 6,187 మంది విద్యార్థులకు 6,071 మంది హాజరు కాగా, 116 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,238 మంది విద్యార్థులకు 1,192 మంది హాజరు కాగా, 46 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ శంకర్ నాయక్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

వికారాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కారించాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతుర సుధీర్ అన్నారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో దివ్యాంగుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ .. అసెంబ్లీ సమావేశాల్లో దివ్యాంగుల సమస్యలపై చర్చించేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవ చూపాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు రూ.6వేల పెన్షన్ అమలుకావడం లేదని, రూ.4 వేలే ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అట్రాసిటీ చట్టాన్ని కఠినతరం చేయాలని, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చంద్రయ్య, ఎం. చుక్కయ్య, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బొక్కోనిగూడలో వరి పైరుకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు



వరికి అగ్గి

కాటేస్తున్న కాండం తొలుచు పురుగు

తెగుళ్లతో వందల ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంట
ఎరువుల దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
రెండు, మూడు సార్లు మందుల పిచికారీ
అయినా అదుపులోకి రాని తెగుళ్లు
వాతావరణ మార్పుల వల్లే అంటున్న అధికారులు
కన్నీరుమున్నీరవుతున్న రైతన్నలు



తెగులు సోకి పాడైన వరి పైరు

మండలాల వారీగా వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	
ఘట్‌కేసర్	3,200
కీసర	1,650
శామీర్‌పేట్	1,925
మూడుచింతలపల్లి	3,000
మేడ్చల్	2,800
మొత్తం	12,575

“ త్వరలో యాసంగి వరిపంట చేతికొస్తుందనుకున్న సమయంలో తెగుళ్లు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రస్తుతం అధిక శాతం పంట పొట్ట దశలో ఉంది. ఓ పక్క అగ్గితెగులు, మరోపక్క కాండం తొలిచే పురుగు, ఈ రెండూ పంటను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. పైరు పూర్తిగా ఎర్రగా మారడంతో కనీస దిగుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. కళ్ల ముందే పంట పాడవుతుండటంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఏ మందులు వాడినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదని లబోదిబోమంటున్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 12,575 ఎకరాల్లో వరి సాగు చేశారు.

ఘట్‌కేసర్, మార్చి12(ఆంధ్రజ్యోతి): సీజన్ ప్రారంభంలో వరిపైరు ఆశాజనకంగా ఉన్నప్పటికీ రానురాను తెగుళ్లు సోకి ఆందోళనకరంగా మారింది. ప్రధానంగా జిల్లాలో చెరువులు, కాల్వలు, బోర్లు బావుల కింద అధిక విస్తీర్ణంలో వరిసాగు చేపట్టారు. ప్రధానంగా ఘట్‌కేసర్ మండలంలో ఓ వైపు మూసీ మరోవైపు ఎరిమల్లివాగుతో సాగునీటి వసతి పుష్కలంగా ఉండటంతో రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపారు. ఘట్‌కేసర్ మండలంలో 3,200 ఎకరాలు, కీసరలో 1,651 ఎకరాలు, శామీర్‌పేట్‌లో 1,925 ఎకరాలు, మూడుచింతలపల్లిలో 3,000 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 2,800 ఎకరాల్లోల చొప్పున మొత్తం 12,575 ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుతం అధిక విస్తీర్ణంలో పంట పొట్టదశలో ఉంది. చాలా చోట్ల అగ్గి తెగులు సోకి పైర్లు బాగా దెబ్బతిన్నాయి. దీంతో పాటు కాండం తొలిచే పురుగు ఆశించి పంటను ధ్వంసం చేస్తున్నాయి. పైరును కాపాడుకోవడానికి రైతులు అధికారుల వద్దకు క్రిమిసంహారక మందుల దుకాణదారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. మందులు తెచ్చి

మిగతా 8వ పేజీలో...



పంట పూర్తిగా మాడిపోయింది

మొదట్లో పైరు చాలా బాగుంది. చిరుపొట్ట దశకు వచ్చేసరికి అగ్గి తెగులు వ్యాపించి చేసంత మాడిపోయింది. వెంటనే అధికారులకు సమాచారం అందించి వారి సూచనల మేరకు రెండు దఫాలు మందులు పిచికారీ చేశాను. ఐదెకరాల విస్తీర్ణంలో దాదాపు రెండెకరాల వరకు పూర్తిగా దెబ్బతిన్నది.

\- శ్రీనివాస్‌రెడ్డి, రైతు బొక్కోనిగూడ, ఘట్‌కేసర్



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

మాదిగలను నమ్మించి మోసం చేశారు

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే నియామకాలు చేపట్టాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ

తాండూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండానే గ్రూప్-1, 2, 3 ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేయడంతో మాదిగలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బుధవారం తాండూరు పట్టణం అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు మాదిగ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిసామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30ఏళ్ల పోరాటం ఉద్యోగాల కోసమని అలాంటి ఉద్యోగాలకు వర్గీకరణ అమలు చేయకపోవడంతో మాదిగలు నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు మాదిగ, కన్వీనర్ శివాజీ, కార్యదర్శి డప్పు మహేందర్, యాలాల, పెద్దేముల్, తాండూరు అధ్యక్షులు సూర్యప్రకాశ్, ఉమాశంకర్, పరుశురాం, ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్, శివకుమార్, బస్వరాజ్, సిద్ధు, రాము తదితరులున్నారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఫర్టిలైజర్ దుకాణ డీలర్లకు డీఏవో మోహన్‌రెడ్డి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

కొడంగల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల డీలర్లకు వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్ మండలంలోని పర్సాపూర్ రైతు వేదికలో నిర్వహించిన డివిజన్ స్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రానున్న వర్షాకాల సీజన్‌కు సంబంధించి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు నష్టపోకుండా నకిలీ విత్తనాల బారిన పడకుండా డీలర్లు సహకరించాలన్నారు. ఎరువులు, విత్తనాల విక్రయాలకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు తులసి, హిమబిందు, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు రాథోడ్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో

కొలువుల పండుగ

జిల్లాలో 287 ఉద్యోగాల భర్తీకి అవకాశం

49 టీచర్, 238 హెల్పర్ పోస్టులు
ఇంటర్ విద్యార్హత తప్పనిసరి
నోటిఫికేషన్ జారీ చేసేందుకు సన్నాహాలు
ఐదు ప్రాజెక్టుల్లో మొత్తం 1,107 కేంద్రాలు

ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీలు	
కొడంగల్	234
మర్పల్లి	148
పరిగి	213
తాండూరు	279
వికారాబాద్	233

వికారాబాద్, మార్చి12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చాలా కాలంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీ కోసం వెలువడిన నోటిఫికేషన్ ఇదే. జిల్లాలో 49 టీచర్, 238 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన సంఖ్యలో టీచర్లు, హెల్పర్లు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

మిగతా 8వ పేజీలో...



మాతా, శిశు అభివృద్ధే లక్ష్యంగా..

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమైన సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు వయస్సు కలిగిన చిన్నారుల పెరుగుదల, అభివృద్ధి తదితర సేవలను అందిస్తున్నాయి. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు వయస్సు ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకపూట సంపూర్ణ భోజనం అందజేస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు, 200 మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సున్న చిన్నారులకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు పంపిణీ చేస్తుండగా, ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సు కలిగిన వారికి నెలకు సరిపడా బాలామృతం, 16 గుడ్లు అందిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రిజిస్ట్రార్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని పాత లేఅవుట్‌ల ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి చెల్లించే ఫీజులో 20 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నగర శివారులో చాలా వరకు అన్ ఆథరైజ్డ్ లేఅవుట్‌లు ఉన్నాయని ఇలాంటి లేఅవుట్‌లలో ప్లాట్లు కొన్న పాట్లు రెగ్యులరైజ్ చేసుకునడానికి ప్రస్తుతం మంచి అవకాశమన్నారు. పాత లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకుండా తమ వద్దే ఉంచుకున్న ప్లాట్ల యజమానులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ అశోక్, జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

నియామక పరీక్షల్లో

మనోళ్ల సత్తా

» గ్రూప్-1లో ప్రతిభ చాటిన సస్యరెడ్డి
» గ్రూప్-2 విజేతగా నేనావత్ అనిల్
» జేఎల్ నియామక పత్రం అందుకున్న బ్రాహ్మణి



సస్యరెడ్డి



నేనావత్ అనిల్



బ్రాహ్మణి

కోట్‌పల్లి/దోమ/బొంరాస్‌పేట్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల్లో జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు సత్తాచాటారు. గ్రూప్-1,2, జేఎల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. కోట్‌పల్లి, మండలం మోత్కుపల్లి గ్రామానికి చెందిన కొరెల్లి సస్య రెడ్డి గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. తన తండ్రి వెంకటరెడ్డి ప్రోత్సాహంతో మొదటి అటెంప్ట్‌లోనే సత్తాచాటి 462.5 మార్కులు సాధించింది. ఆమె విద్యాభ్యాసం 1 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్‌లో, ఇంటర్మీడియట్ బెంగళూర్‌లో, డిగ్రీ ఢిల్లీలో బీఏ పొలిటికల్ సైన్స్ ఆనర్స్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఎంఏ పొలిటికల్ సైన్స్ మైత్రీ కాలేజీలో చదువుతూ గ్రూప్-1కు పరీక్షకు హాజరైంది.

గ్రూపు-2 ఫలితాల్లో 106వ ర్యాంక్

దోమ మండలంలోని బ్రహ్మణపల్లి పెద్ద తండాకు చెందిన నేనావత్ అనిల్ బుధవారం విడుదలైన గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 106వ ర్యాంకు, ఎస్టీ రిజర్వేషన్‌లో 4వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు మాణిక్యనాయక్, ముత్యాలి బాయి గతంలోనే మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన నేనావత్ అనిల్ చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తూ ముగ్గురు సోదరుల సహకారంతో గ్రూపు-2 ఫలితాల్లో సత్తా చాటాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అతన్ని అభినందించారు.

నియామక పత్రం అందజేత

బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీటీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న బ్రాహ్మణి ఇటీవల వెలువడిన జూనియర్ అధ్యాపక ఫలితాల్లో మహిళా విభాగంలో హిస్టరీ సబ్జెక్టులో మొదటి ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని రవీంద్రబారతీలో ఆమె బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బ్రాహ్మణిని అభినందించారు. అదే విధంగా పీఆర్‌టీయూ సంఘం మండల అధ్యక్షుడు పి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.శశిధర్ తదితరులు అభినందించారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

క్రీడలతో యువతకు గుర్తింపు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): క్రీడలతో యువతకు జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో గుర్తింపు వస్తుందని జేఎన్టీయూ పీడీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఎస్ఏ.దిలీప్ తెలిపారు. ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం కురుక్షేత్ర-2025 క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు వస్తుందన్నారు. క్రీడల్లో రాణించే వారికి స్పోర్ట్స్ కోటాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటాయన్నారు. రెండురోజులు జరిగే కురుక్షేత్ర-2025 క్రీడాపోటీల్లో 120జట్లు పాల్గొనున్నాయి. కార్యక్రమంలో కేపీఆర్ఐటీ డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు రవీంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, పీడీలు రంజిత్, లిదిజా రాణి, సంజీవులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రసాంకేతికను సద్వినియోగం చేసుకోవాలి



డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న ఆర్బీఐ అధికారులు

దోమ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ బ్యాంకు లావాదేవీలను సులభతరం చేసుకోవాలని ఆర్‌బీఐ అధికారులు సావిత్రి, రెహ్మాన్ అన్నారు. దొంగ ఎన్కేపల్లిలో బుధవారం డిజిటల్ విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా ద్వారా బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పగానే బ్యాంక్ వివరాలు, ఓటీపీలు చెప్పొద్దన్నారు. బ్యాంకర్ల ఎవరూ ఫోన్‌కాల్‌లో వివరాలు అడగరని, బ్రాంచిలో మాత్రమే వివరాలు తెలుసుకుంటారని చెప్పారు. ఏదైనా మోసాలకు గురై ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకున్న వారు 24గంటల్లోపు 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం విజయేందర్, ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సాంస్కృతిక విభాగంలో

బలరాంకు ప్రథమ బహుమతి


బలరాం

ఇబ్రహీంపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నేనావత్ బలరాం జాతీయ సాంస్కృతిక విభాగంలో ప్రథమ బహుమతి అందుకున్నారు. ఇటీవల ఒడిశాలోని బరంపూర్ యూనివర్సిటీ వేదికగా జరిగిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో తెలంగాణ తరఫున బలరాంతో పాటు ఆరుగురు విద్యార్థుల బృందం తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాలు, పోతరాజుల విన్యాసాలు, బతుకమ్మ ఆటపాటలను ప్రదర్శించారు. కాగా, పోతురాజుల విన్యాసంతో అలరించిన బలరాంకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. రాధికతో పాటు అధ్యాపక బృందం బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బలరాంను అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమార్కెట్ యార్డు అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఇతర వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించడం జరుగుతుందని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి. రాములు తెలిపారు. బుధవారం చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులందరూ ఏపీలోని అనంతపురం, కర్నూల్, మదనపల్లి తదితర వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతుల కోసం అక్కడి ప్రభుత్వాలు, అధికారులు చేపడుతున్న విధానాలను క్షేత్రస్థాయిలో మార్కెట్ పాలకవర్గం సభ్యులు, అధికారులు తెలుసుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రధాన మార్కెట్ యార్డులను సందర్శించనున్నట్లు చెప్పారు. ఈ పర్యటన రెండు రోజుల పాటు ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జనార్ధన్, మల్లేష్, నరేందర్, యాదయ్య, హనీఫ్, బాలయ్య, యాదిరెడ్డి, సత్యనారాయణ, సుదర్శన్‌గౌడ్, కృష్ణారెడ్డి,వెంకట్‌రెడ్డి, మార్కెట్ అధికారులు తదితరులు ఉన్నారు.


అనంతపురంలో మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న చేవెళ్ల మార్కెట్ పాలకవర్గ సభ్యులు

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- ఎనిమిది రోజుల పాటు కొనసాగనున్న జాతర
- దేవుని పడకల్‌లో భక్తులకు వసతుల కల్పన
- 17న తిరుకల్యాణం.. 18న రథోత్సవం


దేవుని పడకల్‌లోని వేంకటేశ్వరాలయం, స్వామివారి మూలవిరాట్

తలకొండపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో అతి ప్రాచీన దేవాలయంగా ఖ్యాతిగాంచి ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌లో కొలువైన శ్రీ లక్ష్మీ అలివేలు మంగ, గోదాసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి(గురువారం) నుంచి 20వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఇక్కడ ఏక శిలలో శ్రీదేవి, భూదేవి, విశ్వక్సేన సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై వేంచేసి ఉండడం ఓ ప్రత్యేకత. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, ఆరాధకులు నడాదూర్ రామాచార్యులు, పరవస్తు గోపాలాచార్యులు వివరించారు. 13న అభిషేకం, ఋత్విక్‌కరణం, స్వస్తివాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పన, 14న ఆదివాసం, ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, 15న పారాయణం, బలిహరణం, హంస వాహన సేవ, హనుమంత వాహనం, 16న పారాయణం, మోహిని సేవ, బలిహరణం, హోమం, గరుడసేవ, ఎదుర్కోళ్లు, 17న తిరుకల్యాణం, గజ వాహనసేవ, 18న నిజరూప దర్శనం, మహాభిషేకం, రథోత్సవం, 19న అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లంకాదహనం, అశ్వవాహనం, 20న చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, ధ్వజారోహణం, పందెంగుండు పోటీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహేశ్వరం ఏఎంసీ చైర్మన్‌గా కృష్ణానాయక్

- వైస్ చైర్మన్‌గా యాదయ్య నియామకం


కేఎల్లార్‌ను కలిసిన కృష్ణానాయక్, యాదయ్య

మహేశ్వరం,మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం అధికారిక నియామకానికి బుధవారంతో తెరపడింది. 18 మందితో కూడిన మార్కెట్ కమిటీ నియామక జీవోను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు బుధవారం విడుదల చేశారు. చైర్మన్‌గా కృష్ణానాయక్, వైస్ చైర్మన్‌గా యాదయ్య, మెంబర్లుగా పుష్ప, ప్రశాంత్‌కుమార్, యుగందర్, సురేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంఏ జావీద్, అల్లె భిక్షపతి, పాండురంగారెడ్డి, యాదయ్య, ధన్‌పాల్‌రెడ్డి, పాండులతో పాటు మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్, డివిజన్ వ్యవసాయాధికారి, మహేశ్వరం గ్రామపంచాయితీ ప్రత్యేకాధికారితో కలుపుకొని కమిటీ పాలకవర్గం జీవోను మార్కెటింగ్ వ్యవసాయ శాఖ ప్రకటించింది. చైర్మన్‌గా నియమితులైన కృష్ణానాయక్ మాట్లాడుతూ మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ పాలకవర్గంతో పాటు అధికారుల సూచనలు, సలహాలతో చైర్మన్‌గా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

అర్హులందరికీ రేషన్ కార్డులు

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మార్చి12(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 114 మంది లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొత్త రేషన్‌కార్డులతో పాటు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల మండలంలో కొత్తగా 760 రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. ఒక్క చేవెళ్ల పట్టణ కేంద్రంలోనే 114 మందికి కార్డులను అందించినట్లు తెలిపారు. చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య, మున్సిపాల్ కమిషనర్ పూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జె.లక్ష్మారెడ్డి, పాండుయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతిక్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జి.రాములు పాల్గొన్నారు.

రైతుబిడ్డకు గ్రూప్-2లో 27వ ర్యాంకు


కుటుంబీకులతో ఒగ్గు చంద్రకాంత్

శంకర్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో మండలంలోని కొత్తపల్లికి చెందిన ఒగ్గు చంద్రకాంత్ రాష్ట్రంలో 27వ ర్యాంక్ సాధించి శభాష్ అనిపించాడు. ప్రస్తుతం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2024 డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాలలో సైతం రాష్ట్రంలో 27వ ర్యాంకు సాధించి జూనియర్ అసిస్టెంట్‌గా సెలక్టయ్యాడు. 2018లో పోస్ట్ ఆఫీస్‌లో మెయిల్ క్యారియర్‌గా ఎంపికై చేవెళ్ల మండలంలోని ఆలూరు, తంగేడిపల్లిలో 45రోజుల పాటు విధులు నిర్వహించాడు. తదనంతరం మెయిల్ క్యారియర్ జాబ్‌కు రిజైన్ చేశాడు. 2023లో జూనియర్ లెక్చరర్(సివిక్స్) పరీక్ష వ్రాయగా 2024లో ఫలితాలు వచ్చాయి. అందులో రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించాడు. మార్చి 12న బుధవారం నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో అధికారుల చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. జూనియర్ లెక్చరర్ నియామకపత్రం తీసుకున్నా గ్రూప్-2లోమంచి పోస్టు వస్తే ఎంచుకుంటానని చంద్రకాంత్ తెలిపాడు. కాగా, రైతు బిడ్డ కష్టపడి చదివి వరుసగా నాలుగు ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు వినోద, విఠలయ్యలతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రకాంత్ అన్న శ్రీకాంత్ కానిస్టేబుల్‌గా గచ్చిబౌలిలో విధులు నిర్వహిస్తున్నాడు.

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన సౌందరరాజన్


వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న సౌందరరాజన్

మొయినాబాద్‌రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సౌందరరాజన్ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నగరంలో బుధవారం సాయంత్రం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసానికి వెళ్లి చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి శేషవస్త్రంతో పాటు ఆశీర్వచనాలు అందించారు. ఈసందర్భంగా సౌందరరాజన్ మాట్లాడుతూ వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆలయం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించామన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియారంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చెక్కల శ్రీశైలం ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ కేంద్రంగా పనిచేస్తూ రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీశైలంకు తోటి జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. అర్హత కల్గిన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు, ఇంటి స్థలం, ఆరోగ్య బీమా, రవాణా సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తానని, జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని, సమాజంలో ఆదర్శంగా నిలవడానికి శిక్షణ తరగతులను సైతం నిర్వహిస్తామని శ్రీశైలం పేర్కొన్నారు.

2.5 కిలోల గంజాయి పట్టివేత


పట్టుబడిన మహబూబ్

మొయినాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చికెన్ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన బుధవారం రాత్రి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. చేవెళ్ల డిటెక్టివ్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ గేట్ సమీపంలో ఏజెఆర్ చికెన్ సెంటర్‌లో గంజాయి అమ్ముతున్నట్లు మొయినాబాద్ పోలీస్‌లకు పక్కా సమాచారం అందింది. చేవెళ్ల డిటెక్టివ్ సీఐ ఉపేందర్, ఎస్సై నర్సింహరావులు అజీజ్‌నగర్‌లోని ఏజెఆర్ చికెన్ సెంటర్‌లో తనిఖీలు చేయగా 2.5 కిలోల గంజాయి దొరికింది. దాంతో షాపులో ఉన్న మహబూబ్‌ను అదుపులోకి తీసుకుని మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

రంగారెడ్డిఅర్బన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. కాస్లాబాద్ గ్రామానికి చెందిన రామానుజరెడ్డి వ్యవసాయ పొలం వద్ద బుధవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌లో స్పార్క్ కారణంగా నిప్పు రవ్వలు కిందిపడ్డాయి. అయితే, భూమిపై ఎండు గడ్డి ఉండటంతో నిప్పంటుకుంది. దాంతో మంటలు చెలరేగి ట్రాన్స్‌ఫార్మర్ వరకు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా.. ఫ్యూజ్ లూజ్ కనెక్షన్ ఉండటం వల్ల షార్ట్‌సర్క్యూట్ అయ్యిందని.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పిస్తున్న కరీం అన్సారీ

ఆర్టీఐతో సమాచారాన్ని పొందొచ్చు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ చట్టం ద్వారా పౌరులు ప్రజాస్వామిక సంస్థల సమాచారాన్ని పొందుతారని రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్(ఆర్టీఐ) కార్యకర్త కరీం అన్సారీ అన్నారు. వెంకటాపూర్‌లో గల అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన ఆర్టీఐపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. దేశంలో ఆర్టీఐ చట్టం శక్తిమంతమైందన్నారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ అమనుమతులు పొందిన సంస్థల సమాచారాన్ని పౌరులు ఆర్టీఐ కింద అప్లై చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజాధన దుర్వినియోగం, అవినీతిపై ప్రశ్నించగలిగే శక్తి ఆర్టీఐ పౌరులకు కల్పించిందన్నారు. యూఆర్టీఐ వెబ్‌సైట్ ఆర్టీఐ అభ్యర్థనలను సులభతరం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఐ కార్యకర్తలు పరమేశ్, కామేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మచెరువు కట్టపైకి భారీ వాహనాలను నిషేధించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీందర్

మేడ్చల్ టౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ తుమ్మచెరువు కట్ట మీద భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు పానుగంటి రవీందర్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే సొంత డబ్బుతో తుమ్మ చెరువు కట్టపై సీసీ రోడ్డు వేయించారని తెలిపారు. సీసీ రోడ్డు సామర్థ్యం భారీ వాహనాలను తట్టుకోదని తెలిపారు. ఇప్పటికే సీసీ రోడ్డు బీటలు వారిందన్నారు. కట్టకు ఇరు వైపులా బారికెడ్లు పెట్టి పాఠశాలల బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాల నిషేధించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుమాధవ్

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులివ్వాలి


ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగలకు తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని సంఘం ప్రధానకార్యదర్శి అవళందార్ వేణుమాధవ్ డిమాండ్ చేశారు. కొర్రెముల పరిధి సుప్రభాత్ టౌన్‌షిప్‌లో బుధవారం రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, సింగరేణి ప్రాంతాల్లో నివసిస్తున్న రిటైర్డ్ కార్మికులకు ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌లో నివసించేందుకు అనుమతివ్వాలి, హైదారాబాద్‌లో సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కార్యాలయం నిర్మించాలని, ఇంటి నిర్మాణానికి 200గజాల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మున్నూరు కాపు మహిళలు

మున్నూరు కాపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మేడ్చల్ టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు మహిళా మ్యాక్స్ సంస్థ ఉన్నత కార్యనిర్వాహణ అధికారి సర్దార్ పుటమ్ పురుషోత్తంరావు అన్నారు. మున్నూరు కాపు మహిళల పరస్పర సహకార సంఘం లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశాన్ని బుధవారం మేడ్చల్‌లోని అత్వెల్లిలో నిర్వమించారు. పురుషోత్తంరావు మాట్లాడుతూ... మున్నూరు కాపుల ప్రధాన వృత్తి వ్యవసాయమన్నారు. ఆర్థిక వృద్ధి సాదించేందుకు వివిధ వృత్తుల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో జయసుధ

గ్రామాలను సందర్శించిన డీపీవో

ధారూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): కేరెల్లి, చింతకుంట గ్రామాలను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సందర్శించారు. నర్సరీలను, వర్మి కంపోస్టు షెడ్‌లను ఆమె పరిశీలించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను ఆమె తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.



పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ మహిపాల్

పాలన చేతకాకే అరెస్టులు

దౌల్తాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచ్‌లు, మాజీ జడ్పీటీసీ, ప్రజాప్రతినిధులను అరెస్టు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేసి నిధులు ఖర్చు చేసినా మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం నేటి వరకు పెండింగ్ బిల్లులు అందించకపోవడం శోచనీయం అన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతునొక్కే ప్రయత్నంలో భాగంగానే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. గ్యారంటీలను అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మాజీ సర్పంచ్‌లు శిరీష, రమేశ్, బుడ్డప్ప, మంజులాల్ నాయక్, పాండునాయక్, హరికృష్ణ తదితరులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మోమిన్‌పేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ జి.వెంకట్ హెచ్చరించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి సారా, మట్కా, పేకాటను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలుంటే ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రండెన్ డ్రైవ్‌ల్లో పట్టుబడితే జరిమానా, జైలుశిక్ష తప్పవన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సై అరవింద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చదువుతున్న కాలేజీలోనే గంజాయి అమ్మకాలు

● విద్యార్థి అరెస్ట్ 1.30కిలోల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవనానికి అలవాటు పడ్డ విద్యార్థి, తాను చదువుతున్న కాలేజీలోనే స్నేహితులకు గంజాయి విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘట్‌కేసర్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. గంజాయికి అలవాటు పడ్డ రాజు.. డబ్బుల కోసం తన కళాశాలలోనే సాటి విద్యార్థులకు గంజాయి విక్రయించడం ప్రారంభించాడు. బీదర్ నుంచి గంజాయి కొనుగోలు చేసి, నగరానికి తెచ్చి చిన్న ప్యాకెట్లలో విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం నిఘాపెట్టి, గంజాయి అమ్ముతున్న రాజును అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.3కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కోట్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోట్‌పల్లి, ఇందోల్, ఒగ్లపూర్, బుగ్గాపూర్, అన్న సాగర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామీణులకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు.



కోట్‌పల్లి: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్: తాండూరు మండలం ఉద్దండాపూర్‌నకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.8లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. హైదర్‌మియా ఇంటి నుంచి గోరేసాబ్ ఇంటి వరకు, తానోజీ ఇంటి నుంచి గొల్ల శామప్ప ఇంటి వరకు రోడ్డును వేస్తారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ఆనంద్‌రావు, హరిశ్చందర్‌రెడ్డి, వీరారెడ్డి, రాజు, హుస్సేనప్ప, రియాజ్, మహేందర్‌రెడ్డి, ప్రదీప్, రాజు, శ్రీనుగౌడ్, శామప్ప పాల్గొన్నారు.



తాండూరు మండలం ఉద్దండాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

ధారూరు: మోమిన్‌కుర్దులో సీసీ రోడ్డు పనులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ప్రారంభించారు. సీసీరోడ్డుకు ఎంపీ కోటా నిధులు రూ.5లక్షలు మంజూరయ్యాయి. నాగిరెడ్డి ఇంటి నుంచి పి.రమేశ్ ఇంటి వరకు 135మీటర్ల సీసీ రోడ్డు వేస్తారు. ఇందుకు మాధవరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, రమేశ్, రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్, అర్జున్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



నీటి కోసం కారోబార్‌ను నిలదీస్తున్న మహిళలు

తాగునీటి కటకట.. పట్టించుకోని అధికారులు

దోమ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్‌లోని మూడో వార్డులో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని బుధవారం మహిళలు కారోబార్ శ్రీశైలాన్ని నిలదీశారు. నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ధారూరు బాలుర పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు

పాఠశాలలో ఎస్ఈఈఆర్‌టీ తనిఖీలు

ధారూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): ధారూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను మంగళవారం ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు తనిఖీ చేశారు. పదో తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు, విద్యార్థుల జవాబు పత్రాలను ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు డాక్టర్ వనజ, డాక్టర్ వనిత తనిఖీలు చేశారు. పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు టీ-శాట్ అంశాలు, తరగతుల బోధన, ఉపాధ్యాయుల డైరీలు, రికార్డులు, టైం టేబుల్‌ను పరిశీలించారు. బేస్‌లైన్, మిడ్‌లైన్ టెస్టులు, పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల జవాబు పత్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి వేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలు

దోమ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారంలో గల శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారంను ంచి ఈ నెల 16 వరకు ఆలయ 19 వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకుడు మూడావత్ రాములునాయక్ బుధవారం తెలిపారు. 13న విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తు హోమం, అంకురార్పణ, 14న సుప్రభాతం, ఆరాధన సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్టి, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, తీర్థప్రసాద గోష్టి, స హస్రనామ పారాయణం, ఊంజల్ సేవ, 15న సు ప్రభాతం, నిత్య ఆరాధన సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్టి, నిత్యాహవనం, 16న సుప్రభాతం, నిత్యారాధన, హోమం, పూర్ణాహుతి, చక్ర స్నానం, శ్రీవారి క ల్యాణోత్సవం, పల్లకీ సేవ, పుష్పయాగం, ఏకాంత సేవ, ఆశీర్వచనాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు భారీసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



మైలారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో హబీబ్ అహ్మద్

కులకచర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బోధనలో ప్రతిభ కనబర్చి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకురావాలని ఎంఈవో హబీబ్‌అహ్మద్ అన్నారు. బుధవారం కులకచర్ల, చౌడాపూర్ మండలాల చెందిన 2008-డీఎస్సీలో ఎంపికైన ముగ్గురు సమగ్ర శిక్ష ఉద్యోగులు కృష్ణయ్య, విద్యాసాగర్, సతీశ్‌కుమార్‌లకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వారిని సన్మానించారు. సమగ్ర శిక్షణలో అనుభవం పొంది బోధనకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని, బాగా బోధించి గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో చౌడాపూర్ ఎంఈవో రాంచందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేశ్, రాఘవేందర్ రెడ్డి, గులాం, విజయ్ శ్రవణ్‌కుమార్, నర్సిములు, సతీశ్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

కొడంగల్ రూరల్, 12(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. బుధవారం బోయపల్లితండా, పలుగుర్రాళ్లతండా, పాటిమీదిపల్లి, పోచమ్మతండాల్లో అధికారులు సభ నిర్వహించి చేసిన పనులపై కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంచాయితీ కార్యదర్శులు, కూలీలు, అధికారులు పాల్గొన్నారు.



బోయపల్లి తండాలో సభలో అధికారులు, ఉపాధి కూలీలు

డబుల్ బెడ్‌రూమ్‌లే అడ్డాగా చోరీలు

షాద్‌నగర్ రూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి) షాద్‌నగర్ పట్టణ శివారులో ఉన్న డబుల్ బెడ్ రూంలను అడ్డాగా చేసుకొని పలు కాలనీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలు అక్కడే నివాసముంటూ సమీప కాలనీల్లో తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం న్యూ తిరుమల కాలనీకి చెందిన రాజేష్ అనే ఉపాధ్యాయుడు ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ విధులకు వెళ్లాడు. ఈక్రమంలో దొంగ ఇంట్లోకి బీరువా తాళం కూడా విరగ్గొట్టి అందులో ఏమీ దొరక్కపోవడంతో పక్కనే ఉన్న కనకయ్య వరండాలోకి వెళ్లాడు. అక్కడ ఇంటి తాళం విరగ్గొడుతుండగా చుట్టుపక్కల వాళ్లు చూడటంతో గోడ దూకి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే పట్టణంలోని మాతా టెంట్‌హౌజ్ గోదాంలో పది రోజుల కింద తెల్లవారుజామున ముగ్గురు దొంగలు గోదాంలోకి వెళ్లి మూడు సంచుల్లో సామగ్రి నింపుకున్నారు. అనంతరం పారిపోతుండగా వాకింగ్‌కు వెళ్లేవాళ్లు పట్టుకున్నారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో షాద్‌నగర్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు మాత్రం నమోదు చేయకుండానే దొంగను వదిలేశారు.



కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి హోలీ జరుపుకుంటున్న లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు

ముందస్తు హోలీ

కడ్తాల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రంగుల కేళి హోలీ వేడుకలను కడ్తాల మండల కంద్రంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, సురేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

కల్యాణలక్ష్మి పథకం
దుర్వినియోగంపై ఫిర్యాదు

బషీరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ తహసీల్దార్ వెంకటేష్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. రెండు, మూడేళ్ల కిందట పెళ్లిచేసుకున్న వారికి కొందరు కార్యదర్శులు ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్ జారీచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రామాల వారీగా విచారణ జరిపి సంక్షేమ పథకాలు దుర్వినియోగం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

కులకచర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో హబీబ్ అహ్మద్ బుధవారం పేర్కొన్నారు. మండల పరిధిలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కులకచర్ల బాలుర, బాలికల పాఠశాలలు, పుట్టపహాడ్, ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో 614 మంది పరీక్షలు రాస్తారని ఆయన తెలిపారు.

మెనూ ప్రకారం భోజనమందించాలి

తాండూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే బాలికలకు భోజనం అందించాలని తాండూరు మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐనెల్లిలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలల్లో తరగతి గదులను, తాగునీటి సౌకర్యం, వంట గదిని, బాత్‌రూంలను పరిశీలించారు. విద్యార్థినుల భోజనాన్ని పరిశీలించి వారితో భోజనం చేశారు. విద్యార్థినులకు డైనింగ్ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రత్యేకాధికారి ఆశాలత తెలిపారు. తనిఖీ సమయంలో నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు గుర్తించి వారికి వైద్యం అందించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేకాధికారి అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని సూచించారు.

చౌడాపూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ప్రభు, ఎంపీడీవో సోమలింగం అన్నారు. చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలను వారు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వంట సామాగ్రి, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. వంట గదిని రోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజన నాణ్యతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగంప్ప, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి

కులకచర్ల: పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. వంట గది, సరుకులు, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంతో మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో వంట సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు



కులకచర్ల: కేజీబీవీలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ మురళీధర్

నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు



గౌరారంలో మూలనపడిన చెత్త సేకరణ రిక్షా

దుద్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాల్లో చెత్త సేకరణ రిక్షాలను కొనుగోలు చేసి పంచాయతీలకు అప్పగించారు.అయితే చెత్తసేకరణ రిక్షాల వినియోగం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ప్రతీ పంచాయతీలో సిబ్బందితో రోజూ చెత్తసేకరించేందుకు రిక్షాలను అందజేశారు.తదనంతర కాలంలో ప్రభుత్వం ప్రతి పంచాయతీకి చెత్త సేకరణకు ట్రాక్టర్లను అందజేసింది. దీంతో రిక్షాలకు బదులుగా ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్లు ఇరుకైన వీధుల్లోకి వెళ్లడం లేదు. ప్రజలు ప్రధాన రోడ్లపై ట్రాక్టర్ కోసం వేచిచూస్తున్నారు. రిక్షాలయితే చిన్న సందులకు సైతం వెళ్లేవి. ఇరుకు వీధుల్లో ట్రాక్టర్లతో చెత్తసేకరణ కష్టతరమైంది. పంచాయతీ కార్మికులు రిక్షాలను వినియోగించకపోవడంతో అవి మూలన పడి తుప్పుపడుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి రిక్షాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీని తనిఖీ చేసిన
మండలాధికారి

బషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గొట్టిగకలాన్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ వై.వెంకటేష్ బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం వండిపెట్టాలని ఆదేశించారు.



టీచర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థి ముస్తాక్ పటేల్

దుద్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దుద్యాలలోని జిల్లా పరిషత్ పాఠశాలో బుధవారం పూర్వ విద్యార్థి ఔదార్యాన్ని చాటుకున్నాడు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. దీంతో పూర్వ విద్యార్థి ముస్తాక్ పటేల్‌లను టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాందర్‌పూర్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సునీత, స్కూల్ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు



ప్రజా సమస్యలపై సర్వే నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఘట్‌కేసర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని సీపీఎం నాయకులు చింతల యాదయ్య అన్నారు. బుధవారం పోచారం పరిధి ఆర్జీకే కాలనీలో ఆరు గ్యారెటీలతో పాటు వివిధ సమస్యలపై సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారని తెలిపారు. అన్నోజిగూడ-ఘనాపూర్ రోడ్డులో వీధిలైట్లు లేక రాత్రి సమయంలో భయ పడుతున్నారని పేర్కొన్నారు. గ్యారెంటీలలో కొన్ని స్కీంలు కొంతమందికి అమలు కావడం లేదని ప్రజలు చెప్పారని తెలిపారు. కొత్త పింఛన్ ఎదురుచూస్తున్నట్లు వివరించారు. తాము గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో సబిత, సునీత, అలివేలు, పద్మ శోభ, విద్యాసాగర్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

వరికి 'అగ్గి'

(ఐదో పేజీ తరువాయి)

పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్లు తగ్గడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వందల ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నది.

వాతావరణ మార్పులతోనే..

ఆకుపచ్చ రంగులో కళకళలాడాల్సిన పైర్లు ఆకులన్నీ ఎరుపురంగులోకి మారి చూస్తుండగానే పంట మొత్తానికి విస్తరిస్తోంది. ఇప్పటికే రెండ దఫాలు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా పంటచేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు గ్రామాల్లో తిరిగి రైతులకు తగుసూచనలు, సలహాలు ఇస్తున్నారు. అయినా తెగుళ్ల ఉధృతి మాత్రం తగ్గడం లేదు. వాతావరణ మార్పులు సైతం అగ్గి తెగులుకు ఆజ్యం పోస్తున్నాయి. రాత్రి సమయంలో చల్లదనం, ఎక్కువగా ఉండి పగటి పూట ఎండ తీవ్రత అధికంగా ఉండటమే తెగుళ్ల సోకడానికి కారణమని అధికారులు వివరిస్తున్నారు. రైతులు నత్రజని(యూరియా) ఎరువును మోతాదుకు మించి వాడటం వలన ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు మొదట్లోనే స్పందించి తెగుళ్లను తట్టుకునే వరి రకాలపై రైతులకు అవగాహన కల్పిస్తే ప్రయోజం ఉండేదని సూచిస్తున్నారు. ఎక్కడెక్కడికో తిరిగి దుకాణదారులు చెప్పిన విత్తనాలు తెచ్చి సాగుచేశామని, అంత జరిగిన తరువాత మందులు పిచికారీ చేయాలని చెప్పి చేతులు దులుపుకోవడం వలన రైతులు నిండా మునుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



తెగుళ్ల కారణంగా వరి పైరు లోపలి నుంచి పైవరకు ఎండిపోతోంది. దుకాణదారులకు సమస్యను వివరించి మందులను పిచికారీ చేస్తున్న. రోజురోజుకు తెగులు పెరుగుతోంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగుచేసిన, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కళ్ల ముందే పంట పాడవుతుంటే ఆందోళన కలుగుతోంది.

- రాములు, కౌలు రైతు, మర్పల్లిగూడ

వాతావరణ మార్పులే కారణం



వరిపైరుకు అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగు సమస్యలను గుర్తించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మందులు పిచికారీ చేయాలని సూచిస్తున్నాం. వాతావరణ మార్పులతో సమస్యలు వస్తున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉంటూ నిత్యం పైర్లను గమనించాలి. ఎలాంటి సమస్యలను గుర్తించిన అధికారులకు తెలియజేయాలి.

- బాసిత్, ఏవో, ఘట్‌కేసర్

అంగన్‌వాడీల్లో కొలువుల పండుగ

(ఐదో పేజీ తరువాయి)

అగమ్యగోచరంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలోని అయిదు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కొడంగల్ ప్రాజెక్టు పరిధిలో 234, మర్పల్లిలో 148, పరిగిలో 213, తాండూరులో 279, వికారాబాద్ ప్రాజెక్టు పరిధిలో 233 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో ఒక టీచర్‌తో పాటు ఒక హెల్పర్ ఉండడం తప్పనిసరి. ఇంతకు ముందు ఈ ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు ఇతర ఉద్యోగావకాశాలు వచ్చి రాజీనామా చేయడం, పని చేస్తున్న టీచర్లలో కొందరికి పదోన్నతులు రావడం, కొందరు ఉద్యోగ విరమణ చేయడం, వ్యక్తిగత కారణాలతో పలువురు ఉద్యోగాలకు స్వస్తి పలకడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలా కాలంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, హెల్పర్ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోకపోవడంతో ఉన్న వారితోనే నెట్టుకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 65 ఏళ్ల వయస్సు దాటిన టీచర్ల స్థానంలో కొత్త వారిని తీసుకోనున్నారు.

కేంద్రం జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు

ఇంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉండగా, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాల మేరకు టీచర్‌తో పాటు హెల్పర్‌కూ కనీసం ఇంటర్ ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని 18 నుంచి 35 సంవత్సరాలుగా స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగాల భర్తీలో 50శాతం హెల్పర్లకు కేటాయించాల్సి ఉంటుంది, ప్రస్తుత హెల్పర్లలో చాలా వరకు టీచర్లుగా పదోన్నతి పొందేందుకు అవసరమైన ఇంటర్ విద్యార్హత లేవని తెలుస్తోంది. ఇంటర్ పాసైన హెల్పర్లకు మాత్రం టీచర్లుగా పదోన్నతులు ఇవ్వనున్నారు.

సంక్షిప్తంగా...

● **కులకచర్ల:** కులకచర్ల మండలంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీల యజమానులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కనెక్షన్లను అధికారులు బుధవారం తొలగించారు. ట్రాన్స్‌కో అధికారులు దాడులు నిర్వహించి 9మంది ఇటుక బట్టీల యజమానులకు జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేశారు. అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది రమేశ్, కూర్మారెడ్డి, రాములు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **నవాబుపేట:** నవాబుపేట మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖదీర్ తండ్రి ఛోటేమియా(75) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న చేవేళ్ల ఎమ్మెల్యే యాదయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్, వైస్‌చైర్మన్ బలవంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జంగయ్య, ప్రభావతి, ఆనందం, భోజిరెడ్డి ఉన్నారు.

● **నవాబుపేట:** వైఆర్‌జీకేర్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మండలంలోని ఏక్‌మామిడిలో హెచ్‌ఐవీ, టీబీ పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ రాములు మాట్లాడుతూ హెచ్‌ఐవీ, టీబీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో 25మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్, సిబ్బంది అంజమ్మ, లావణ్య, ఏఎన్‌ఎం సుశీల, పుష్ప పాల్గొన్నారు.

● **దోమ:** పాలకులు సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇవ్వడం లేదని సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు బుధవారం మాజీ సర్పంచ్‌లు బిల్లులు కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తారని పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచ్‌లను హౌస్ అరెస్టు చేశారు. రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి పనులు చేసినా బిల్లులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు అందించాలని కోరారు.

● **తాండూరు:** మున్సిపాలిటీల్లో వంద శాతం పన్నులు వసూళ్ల లక్ష్యమే ధ్యేయంగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు, నల్లా పన్నుల వసూళ్లకు అధికారులు పర్యవేక్షిస్తారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్‌లకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను నియమించారు. ఈ నెల 31లోపు పన్నులు వసూలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● **దుద్యాల:** యాదవులు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య పిలుపునిచ్చారు. దుద్యాల మండలంలోని చిలుముల్‌మైలారంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నర్సిములు యాదవ్, ఉపాధ్యక్షులుగా రవియాదవ్, నరేశ్‌యాదవ్, కోషాధికారిగా మొగులయ్యలను ఎన్నుకున్నారు.

● **కుషాయిగూడ:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది కోట రామచంద్రారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి ఈ నెల 7న ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కోర్టులో 25ఏళ్లు పనిచేసిన ఆయన రెండుసార్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అయ్యారు.

నేడు కామ దహనం.. రేపు హోలీ

తాండూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. హోలీ సందర్భంగా నిర్వహించే కామదహన కార్యక్రమాన్ని ఈ నెల 13న (నేడు) రాత్రి గంటల వరకు నిర్వహించాలని.. ఈ నెల 14న హోలీ వేడుకను జరుపుకోవాలని తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి బుధవారం ప్రకటించింది. ఎప్పటి లాగే కామదహన, హోలీ పండుగను నిర్వహిస్తున్నట్టు భవానీనగర్ వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. వినాయక మండపం వద్ద రాత్రి 11గంటలకు కామ దహన కార్యక్రమం ఏర్పాటు చేయడమైదని వారు తెలిపారు.

మహిళలకు కుట్టు మిషన్ల అందజేత

పూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దఉమ్మెంతల్‌లో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. హైదరాబాద్ ఆర్చ్ డియోసిస్ సోషల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఉమ్మెంతల్ గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు ఆంథోని, శ్రీనివాస్‌గుప్తా, ప్రభుదాస్, నరేందర్, యేసు, శాంత, కల్పన తదితరులు కుట్టు మిషన్లు అందజేశారు.



కుట్టు మిషన్ అందజేస్తున్న ఆంథోని, శ్రీనివాస్‌గుప్తా

మద్యం షాపులో చోరీ

కొడంగల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలం రావుల్‌పల్లిలోని ఎస్వీవీ బసవేశ్వర వైన్ షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు తాళాలు విరగ్గొట్టి టీవీ, వైఫై రూటర్, హార్డ్ డిస్క్, మద్యం బాటిళ్లు, రూ.65వేలు నగదు ఎత్తుకపోయారని నిర్వాహకులు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

వికారాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మునిసిపల్ పరిధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గిరిగేట్‌పల్లిలో కుక్కలు బుధవారం ఆరుగురిని కరిచాయి. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్,జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

పది ఫోన్ల రికవరీ

వికారాబాద్, మార్చి12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పరిధిలో పలువురు ప్రజలు పోగొట్టుకున్న పది సెల్‌ఫోన్‌లను వికారాబాద్ పోలీసులు రికవరీ చేశారు. ఈ సెల్‌ఫోన్‌లను బుధవారం సీఐ భీంకుమార్ వాటి యజమానులకందజేశారు.

క్రైం కార్నర్

బైక్‌పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

యాలాలు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బైక్‌పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాఘవాపూర్ సమీపంలో జరిగింది. బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంటకు చెందిన సుధాకర్(33) తన అత్తగారి ఊరు రాస్నంలో ఉంటున్నాడు. భాగ్యమ్మకు వివాహం చేసుకొని ఇక్కడే ఉంటున్నాడు. మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం తాండూరులో పనిపూర్తి చేసుకొని బైక్‌పై రాస్నం వస్తుండగా రాఘవాపూర్‌సమీపంలో కిందపడి మృతిచెందాడు. బైక్‌కు అడవి పందులు ఢీకొనడంతోనే పడి సుధాకర్ చనిపోయి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. సుధాకర్‌కు భార్య భాగ్యమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల ఎస్‌ఐ గిరి తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం



చెరువులో రాజు మృతదేహం

మూడుచింతలపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి):చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శామీర్‌పేట్ మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన భీమనాతి రాజ శివకుమార్ ఈ నెల 8న డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య లక్ష్మి దుండిగల్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం శామీర్‌పేట్ చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులు సమాచారమిచ్చారు. చెరుకున్న పోలీసులు మృతదేహం రాజుదిగా నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

నవాబుపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన నారెగూడలో బుధవారం జరిగింది. ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. పోచనోళ్ల పావని(25), భర్త పరమేశ్ ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగలేక పావని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పావని తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

బషీరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిర నగర్‌లో ఓ యువకుడు ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళి నవీన్(30) కుల వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు లేక ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఊరేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.శంకర్ తెలిపారు.

కారులోని డబ్బుతో ఉడాయించిన కేటుగాడు



కారు వద్ద బాధితురాలు శారద

తాండూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కారు టైర్ పంక్చరైందని చెప్పి కారులోని డబ్బు తస్కరించారు. తల్లి వైద్యం కోసం బ్యాంకులో బంగారం తాకట్టుపెట్టి తీసుకున్న డబ్బు దొంగ ఎత్తుకెళ్లడంతో బాధితులు లబోదిబోమన్నారు. ఈ ఘటన తాండూరులో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొంరాస్‌పేట్ మండలం బుర్హాన్‌పూర్‌తండాకు చెందిన రాజు, శారద దంపతులు. రాజు తల్లి శారద అనారోగ్యానికి గురికావడంతో ఆమె వైద్యఖర్చుల కోసం బంగారం తాకట్టు పెట్టేందుకు పాపతో కలిసి తాండూరు వచ్చారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో బంగారం పెట్టి రూ.1.30 లక్షలు తీసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఓ హోటల్లో భోజనం చేసి కారులో బయలుదేరారు. హెచ్‌బీ కాంప్లెక్స్ వద్దకు రాగానే కారు టైర్‌పంక్చరైందని ఓ దుండగుడు చెప్పాడు. దీంతో రాజు కారు ఆపి చక్రం విప్పదీశాడు. భార్య, పాపను కారులో కూర్చోబెట్టి పంక్చర్ చేయించేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న కేటుగాడు కారులో ఉన్న శారదను మాటల్లో పెట్టాడు. టైరు లేదు కాబట్టి కారు పడిపోతుందని, కిందికి దిగాలని ఆమెను ఏమార్చాడు. శారద పాపతో కిందకు దిగే క్రమంలో కేటుగాడు కారులోని క్యాష్‌బ్యాగ్‌తో ఉడాయించాడు. దీంతో లబోదిబోమన్న శారద భర్తకు ఫోన్‌చేసింది. రాజు చేరుకునే సరికే దొంగ పారిపోయాడు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లి వైద్యం కోసం తెచ్చిన డబ్బు దొంగ ఎత్తుకెళ్లడంతో దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నా భర్తను చంపిన వారిని శిక్షించాలి

● బాధితురాలు శ్రీలత ఆవేదన



వివరాలు వెల్లడిస్తున్న శ్రీలత

పంజాగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తన భర్త హత్య వెనుక ఆడపడుచులు, వారి కుటుంబీకుల సభ్యుల పాత్ర ఉందని, వారిని శిక్షించాలని హతుడి భార్య నారంగారి శ్రీలత డిమాండ్ చేశారు. హత్య కేసును మేడ్చల్ పోలీసులు నీరుగార్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డే తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆడపడుచుల నుంచి తన ముగ్గురు చిన్నారుల పేరు మీద మార్పించాలని వేడుకొంది. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తన ముగ్గురు చిన్నారులతో కలిసి దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. శామీర్‌పేట మండలం యాడారానికి చెందిన నారంగారి శ్రీలత, బాలరాజు దంపతులు. వారికి మూడేళ్లలోపు వయసున్న ముగ్గురు కుమారులున్నారు. వారికి రెండు ఎకరాలకుపైగా భూమి ఉంది. బాలరాజు వ్యవసాయం చేసేవాడు. అతడికి తెలియకుండా తల్లిదండ్రులు శివమ్మ, గోపాల్ 1.03ఎకరాల భూమిని బాలరాజు సోదరీమణులు అందె లక్ష్మి, ఎం.శివకుమార్, బత్తుల సంగీతల పేరిట చేయించారు. 2023 మేలో తన భర్త వారింటికి వెళ్లి తన భూమిని తనకివ్వాలని కోరగా ఆడపడుచులు, వారి భర్తలు, ఇతర సభ్యులు మాస్కులు వేసుకొని బాలరాజును కొట్టారని శ్రీలత తెలిపారు. అదే సంవత్సరం సెప్టెంబరు 14న పొలం వద్ద కరెంట్ షాక్ పెట్టి, మాస్కులు ధరించిన ముగ్గురు కొట్టారని చెప్పింది. గాయపడిన తన భర్త తనకు వీడియో కాల్‌చేసి విషయం చెప్పాడన్నారు. తాము మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఎస్‌ఐ నర్సింహాగౌడ్ గాంధీ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్న తన భర్తస్టేట్‌మెంట్ తీసుకున్నారని తెలిపింది. మేజిస్ట్రేట్‌కు కూడా మరణ వాంగ్మూలాన్ని తీసుకున్నారని చెప్పారు. పరిస్థితి విషమించి తన భర్త 2023 సెప్టెంబరు 23న మృతిచెందాడని తెలిపారు. ఎస్‌ఐ నర్సింహాగౌడ్ కేసును తప్పుదోవ పట్టించారని ఆమె ఆరోపించారు. హత్య కేసు నమోదు చేయలేదని, తాము దివ్యాంగులతో కలిసి మేడ్చల్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేయగా కేసు నమోదు చేశారన్నారు. తన భర్తను చంపిన వారిని, సహకరించిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తనను, ముగ్గురు చిన్నారులను అత్తమామలు ఇంట్లోకి రానివ్వడం లేదని తెలిపారు. కరెంట్ షాక్‌పెట్టి హత్య చేశారా, లేక కొట్టి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారా? అనే అనుమానాలున్నాయని తెలిపారు. 15 నెలలు అవుతున్నా పోలీసులు చార్జిషీట్ వేయలేదనిన్నారు. తన వద్ద సాక్ష్యాధారాలు పోలీసులు తీసుకున్నారని, ఇప్పుడు ఎలాంటి ఆధారాలు దొరకడలేదని చెబుతున్నారని వాపోయారు. తనకు, పిల్లలకు ప్రాణ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆమె తల్లిదండ్రులు, దివ్యాంగుల సమితి నాయకుడు శివకృష్ణ పాల్గొన్నారు.

గంజాయి నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఎదులాబాద్ అండర్‌పాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు ఆపి సోదాచేశారు. వారి వద్ద 40గ్రాముల గంజాయి లభ్యమైంది. ఘట్‌కేసర్‌కు చెందిన దంతూరి రాకేష్(26), రోహిత్(24)గా గుర్తించారు. వారు గంజాయి తాగుతున్నట్టు విచారణలో తేలింది. గంజాయిని స్వాధీనం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.